# బొమ్మన్న

**- వి.పి.బి.నాయర్**

అతని పేరు తెలిసినవాళ్లు, తెలియనివాళ్లు అందరూ అతన్ని 'బొమ్మన్న' అనే పిలుస్తారు. పేరు తెలిసినవాళ్లు అలా పిలవడంలో ఆశ్చర్యమేమీలేదు. కానీ అతని పేరు తెలియనివాళ్లు కూడా ఆ విధంగా పిలిస్తే ఆశ్చర్యం కలగదా! కలగనీయండి. ఆశ్చర్యమేకాదు, ఎటువంటి వికారాలు కలిగినా కూడా దానికి ఖర్చేంలేదుకదా!

ఏదేమైనప్పటికీ బొమ్మన్న విషయంలో అటువంటి ఆశ్చర్యమేమీ కలగాల్సిన అవసరంలేదు. ఎందుకంటే-''ఓయ్ దోసకాయ్''! 'ఓయ్ దొండకాయ్!'' అనే పిలుపులు కాయగూరలు అమ్మేవాళ్లు ఎప్పుడూ వింటూంటారు. కానీ అలాంటి పిలుపులకి అభ్యంతరం చెప్పరనేది మనందరికి తెలిసిన నిత్య సత్యం. అందుకే మట్టితోగానీ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తోగానీ రకరకాల బొమ్మలు తయారుచేసి అమ్మే బొమ్మన్నని తెలిసో తెలియకో ''బొమ్మన్నా!'' అని పిలిస్తే అతను దానికి సంతోషంగా ప్రతిస్పందిస్తుంటాడు.

అతను తయారుచేసే బొమ్మలకి ఒక ప్రత్యేకత వుండేది. రాముడు, కృష్ణుడు, రాధ, రాధాకృష్ణులు, శంకరుడు, శివపార్వతులు, వీనస్, అజంతా సుందరి, శకుంతల, దమయంతి వీళ్లవి మాత్రమేకాదు, సాక్షాత్తు ఏడుకొండలవాడి విగ్రహాలు కూడా అతను అతి సుందరంగా మలచేవాడు. పౌరాణిక విగ్రహాలే కాకుండా గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, ఎన్టీ రామారావు, అన్నాదురై, ఎంజీఆర్ వీళ్ల విగ్రహాలు కూడా చేసేవాడు. పార్టీ ఆఫీస్ దగ్గరా, హైదరాబాద్‌లో మహానాడు జరిగితే అక్కడ కూడా ఎన్టీఆర్ బొమ్మలు చెల్లుబడి అయ్యేవి. కానీ తమిళులు ఎవరైనా సరే అన్నాదురై, ఎంజీఆర్ బొమ్మలు కొనుక్కుంటారు. కానీ ధరల విషయంలో మాత్రం వాళ్లు భలే బేరమాడతారు. జయలలిత బొమ్మలు కూడా అతను తయారుచేసి చూసాడు. తమిళులెవరూ కూడా ఆ విగ్రహాన్ని కొనడానికి సిద్ధపడలేదు. కానీ స్త్రీ జాతిని గౌరవించే కొంతమంది తెలుగువాళ్లు మంచి ధర పెట్టి వాటిని కొనుక్కున్నారట. స్టాలిన్, లెనిన్‌వంటి నేతల విగ్రహాలు కూడా ఇంతకుముందు అమ్ముడుపోయేవి. కానీ రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వం పడిపోయిన తరువాత వాటి అమ్మకాలు కూడా చాలా తగ్గిపోయాయి.

బొమ్మన్న విగ్రహాలు తయారుచేసి వాటిని అమ్మి డబ్బు సంపాదించడంలోనే సర్వశక్తులూ ధారపోసి వుంటే దారిద్ర్యమనే పిశాచి అతని కుటుంబపు దరిదాపుల్లోకి రావడానికే భయపడేది. కానీ దాదాపు ప్రతి సంవత్సరం ప్రాణమున్న బొమ్మల్ని సృష్టించడంలో విముఖత చూపించకుండా వుండడంవల్ల, వివాహమైన ఏడు సంవత్సరాల్లోనే పావడా కట్టే ముగ్గురు పిల్లలు, నిక్కరు ధరించే ఇద్దరు పిల్లలూ మన్మథ ప్రసాదంగా లేదా రతీ వరంగా అతనికి లభించారు. బొమ్మలు తయారు చేయడంలో ఖర్చు ఎక్కువగానే వుంటుంది. వాటిమీద ఆదాయం రావాలంటే అవి కాస్త ఎక్కువ రేటులోనే అమ్ముడుపోవాలి. ఎంత పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగినా ఎంత ఆదాయం వచ్చినా సప్తస్వరాలన్నీ ఏకధాటిగా వెలువడి అతని సప్తనాడులని బలహీనపరిచే సామర్థ్యంగల సప్తవక్త్రాలు ఆ ఇంట్లో వున్నాయి కదా! ఏమిటీ! లెక్కల్లో ఏదయినా తేడా వచ్చిందా! లేదు. లేదు... లెక్కల్లో పొరపాటేమీలేదు. అయితే అతని స్వంత స్వరం కూడా అతన్ని బలహీనపరుస్తుందా? కాదు...అయిదుగురు పిల్లలూ, వాళ్ల తల్లి, ఆ తల్లి భర్తగారి చనిపోయిన తండ్రియొక్క సతీమణి. ఆ ఇంట్లో అటూ ఇటూ తిరిగే స్థలానికి కూడా క్షామం కలిగిస్తున్నారని చెప్తే అసలు సమస్య మీకు అర్థమైందనుకుంటా! ఆ విధంగా అష్టసభ్యుల హృదయాలు ఆవేదన పడుతున్న ఆ కుటుంబ వాతావరణానికి అనుగ్రహాలు ప్రసాదించడానికి ముందుకు వచ్చేవాళ్లు ఎవరైనా ఉంటే వాళ్లు నష్టలక్ష్మి, కష్టలక్ష్మి మాత్రమే. బొమ్మన్నకు ఒకరోజు ఎనభై రూపాయలు లాభం వచ్చిందే అనుకోండి. ఆ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఒక్కొక్క పదిరూపాయల నోటుని చుట్టి సిగరెట్టులా కాల్చేయడమే సులువైన వినియోగరీతి. లేకపోతే ఒక మనిషికి ఒకరోజు అయ్యే తిండి ఖర్చుకి పదిరూపాయలు సరిపోతాయా? ముప్పై సంవత్సరాలు ముందైతే రెండ్రూపాయలకి కిలో బియ్యం వచ్చేవి. తాజ్‌మహల్ హోటల్ నుంచి రెండు క్యారేజీల నిండా భోజనం తెప్పించుకుంటే ఇటువంటి కుటుంబానికి రోజు మొత్తానికి సరిపోయేది. ఈ రోజుల్లో పూరెస్ట్ ఆఫ్ ది పూర్‌కి కూడా రెండ్రూపాయలకి బియ్యం దొరకడంలేదు. ఇక ఇతర వస్తువుల ధరల గురించి మాట్లాడకుండా వుండడమే మంచిది.

స్కూలుకి వెళ్లే పిల్లలుంటే వాళ్లకి యూనిఫామ్‌లు, బూట్లు, పుస్తకాలు కావాలి. ఆ పుస్తకాలు పెట్టుకోవడానికి ఒక బ్యాగు కూడా కావాలి. నడిచి వెళ్లేటంత దూరంలో స్కూలుంటే ఫర్వాలేదు. కానీ దూరంగా వుంటే వాళ్లని స్కూలుకి పంపించే ప్రసక్తేలేదు. వీటి గురించి ఆలోచించి తల బద్దలు కొట్టుకున్నప్పుడు బొమ్మన్న అనుకునేవాడు ''ఒకే బిడ్డ వుంటే ఎంత బాగుండేది? అసలు పిల్లలే లేకుంటే ఎంత బాగుండేది?'' అని. కానీ తన పిల్లల్ని ప్రాణాధికంగా ప్రేమించే ఆ తండ్రికి స్వయంభువులు కానీ, ఆ పిల్లల్ని ఎప్పుడూ కూడా ఈ విషయంలో తప్పు పట్టాలనిపించలేదు. కానీ తనొక మద్దెలలా ఇరువైపులా వేధింపబడుతున్నాననే బాధ అతనికి వుండేది. తన పిల్లల కోసం కావలసినంత ఖర్చుపెట్టి ఆ తరాన్ని పెంచి పెద్ద చేస్తే వృద్ధాప్యంలో వాళ్లు తమకి అండగా నిలబడతారని అతనికి నమ్మకముండేది. కానీ డెభ్బై అయిదేళ్ల తర్వాత కూడా. గవాస్కర్‌లాగానీ, టెండూల్కర్‌లాగానీ సెంచరీ కొట్టాలనే దృఢ నిశ్చయంతో ఆయుర్వర్ధకమైన మందులు, మంత్రాలతో కాలం గడుపుతున్న పాత తరానికి చెందిన తన ముసలితల్లికి పరలోకం నుంచి 'హి-మెయిల్ ఆహ్వానం ఎందుకు రావటల్లేదని దారిద్ర్య దుఃఖంతో ఊపిరాడని కొన్ని క్షణాల్లో బొమ్మన్న ఆలోచించకుండా ఉండలేకపోయేవాడు. భార్యాపిల్లల సహాయంతో అతను ఎన్ని బొమ్మలనయినా తయారు చేసేవాడు కానీ అవి అమ్ముడుపోవాలి కదా!

హుస్సేన్‌సాగర్‌లో గణేశుల్ని డైవ్ చేయించే సమయానికి మూడు నాలుగునెలల ముందు బొమ్మన్న అక్కడా, ఇక్కడా వడ్డీకి డబ్బులు తెచ్చి వాటితో వినాయక విగ్రహాలు తయారుచేసే మహాయజ్ఞంలో నిమగ్నుడై ఉండేవాడు. పెద్ద పెద్ద విగ్రహాలు తయారుచేస్తే వేలాది రూపాయలు లాభం వస్తుంది. కానీ దాని పెట్టుబడికి కావాల్సిన ఆర్థిక స్థోమత అతనికి లేకపోవడంవల్ల, బాగా అమ్ముడుపోయే చిన్న చిన్న విగ్రహాలే తయారు చేసేవాడు. అతని బొమ్మల్లోని అందాన్ని చూసి కొంతమంది అడ్వాన్స్ ఇచ్చి మరీ పెద్ద పెద్ద బొమ్మలు తయారు చేయించుకునే వాళ్లు. ఆవిధంగా కొంతవరకూ ధనమార్జించగలిగాడుగానీ తన కుటుంబ ఆర్థిక స్థితి ఒక చిల్లున్న కుండలా వుండడం అతనికెంతో బాధ కలిగించేది. ఏదేమయినప్పటికీ తన ఇంట్లో పొయ్యిలో పిల్లి తొంగోకుండా ఏదో విధంగా రోజులు వెళ్ళబుచ్చుతోందనే సంతృప్తి ఆ బొమ్మ బ్రహ్మయ్యకి జీవితంలో ముందుకు వెళ్లడానికి కావలసిన ప్రేరణ కలిగిస్తూ వచ్చింది.

దసరా రోజుల్లో దేవతా విగ్రహాలు పెద్ద ఎత్తులో అమ్ముడుపోతాయి. రాణిగంజ్ దగ్గర రోడ్డుకి ఒకప్రక్క అతను తన స్థావరం ఏర్పరచుకున్నాడు. చిన్నా పెద్దా విగ్రహాలు అక్కడ వరుసగా పేర్చాడు. ఆ రోజు అమ్మకాలు బాగానే జరిగాయి. కానీ కొనడానికి వచ్చినవారిలో ఒకరికి తల పైకెత్తి నిలబడున్న ఎమ్‌సిహెచ్ వారి డోనాల్డ్‌డక్ బొమ్మే కావాలనుండేది.

మరుసటిరోజు బొమ్మన్న తన బొమ్మలని అదే

స్థానంలో కొలువు పెట్టించాడు. అతను డోనాల్డ్‌డక్ దగ్గర కూర్చున్నాడు. ఆ డస్ట్‌బిన్ నేలలో ఎలా బిగించారో పరీక్షించి ఒక స్క్రూడ్రైవర్ సహాయంతో దాన్ని మెల్లగా బయటకి తీసుంచాడు. బొమ్మల్ని చూడ్డానికి చాలామంది వస్తున్నారు. వాళ్లల్లో తొంభై శాతం మంది ఆ బొమ్మల్ని చూసి ఆనందించడం, ధరల గురించి అడగడం, తర్వాత ఉత్త చేతులూ పుకుంటూ అక్కడ నుంచి వెళ్లిపోవడం అంతే! కానీ తతిమ్మా పదిశాతం మంది లాగి పీకి బేర మాడి కొనేవాళ్లు.

కుష్టురోగి లాంటి ఒక పాత అంబాసిడర్ కారు పెద్ద బ్రేకింగ్ శబ్దంతో బొమ్మన్న ముందుకు వచ్చి ఆగింది. 'డగ డగ' అనే కారు అవిరామ కీర్తన విని దానిలో డీజిల్ ఇంజన్ అమర్చి వుంటారని అనుకున్న బొమ్మన్న ఆ కారు వెనుకవైపు చూసి 'ఓ! ఇలాటి కార్ల నుంచే కదా కారుమేఘం తయారవుతుందని' ఆలోచించి చిన్నగా నవ్వుకున్నాడు. అర్వాచీన శ్రీమంతుల దర్పం తొణికిసలాడుతున్న నలభై ఏళ్ల వయసున్న ఒక స్త్రీ నోటి నిండా కిళ్లీ నములుతూ ఆ కారులోంచి దిగి బొమ్మల్ని అదేపనిగా పరీక్షించడం మొదలుపెట్టింది. తల్లి ముఖం చూసి పిల్ల ముఖమున్న ఒక పన్నెండేళ్ల పాప, ఇంకో ఐదేళ్ల పాప, ఆ కిళ్లీ నోటిని అనుసరించారు. మిలమిలా మెరుస్తున్న నైలెక్స్ వస్త్రాలు ధరించిన ఆ పిల్లల్ని చూస్తే వాళ్లకు ఎక్కువ చదువుకానీ, తెలివితేటలుగానీ వున్నట్లు అనిపించడంలేదు.

''మమ్మీ! మమ్మీ! మనం ఈ బొమ్మ బాతునే కొనుక్కుందాం'' అని పన్నెండేళ్ల పాప అడిగింది. నవ నాగరికతతో తాళింపు మాత్రం చేసుకున్న ఆ మమ్మీ కూడా దానికి సరేనంది. ఇంజను ఆపకుండా కార్లోనే కూర్చున్న డ్రైవర్ కమ్ హజ్బెండ్‌ని బయటకి లాగా ఆమె ఆ విషయం గురించి చెప్పింది.

''వద్దు...వద్దు. దాని ధర చాలా ఎక్కువే వుంటుంది'' అంటూ తన స్వంత భార్యపైనా, స్వంత పిల్లలపైనా వీటో ప్రయోగించాడు తన సమక్షంలో ఒక కుటుంబ కలహం మొదలు కాకూడదని.

''సార్! దీని ధర కొంచెం ఎక్కువగానే వుంది. కానీ పిల్లల మనస్సుని నొప్పించవద్దు. ఇదే వయసున్న ముగ్గురు పిల్లలు నాకున్నారు. దీనిని తయారు చేయడానికి నాకు ఐదొందల రూపాయలు ఖర్చయ్యాయి. కానీ ఈ పిల్లల ముఖం చూసి మూడొందల రూపాయలకే ఇచ్చేస్తాను. తీసుకోండి'' అని బొమ్మన్న చెప్పాడు.

బేరమాడడం తనకేమాత్రం ఇష్టం లేనట్టుగా ''రెండొందల యాభైకి ఇస్తావా?'' అన్న ఒకే ఒక ప్రశ్నని ఆ 'భ.సా' కటువుగా అడిగాడు. (ఇది భర్తా కమ్ సారధికి సంగ్రహ నామం. హజ్బెండ్ కమ్ డ్రైవర్ అనే ఇంగ్లీష్ పదానికి సమానార్థంలో మన భాషలో కూడా ఉండాలి కదా, ఒక చిన్న పేరు.)



''నాకు ఇది పెద్ద నష్టం సార్. ఆ డిక్కీని కాస్త తెరవండి'' అంటూ బొమ్మన్నే స్వయంగా డిక్కీ తెరిచి డోనాల్డ్ డక్‌ని భద్రంగా లోపల పెట్టేసి డిక్కీ మూసేసాడు. 'నేనెంత మంచివాడినో చూసారా!' అనే రీతిలో బొమ్మన్న ఆ స్త్రీ ముఖం మీదకి ఒక దరహాసాస్త్రం వదిలాడు. నవ్వినా మాట్లాడినా క్రమం తప్పని తన తాంబూల చర్వణానికి విఘ్నం కలుగుతుందేమోననే భయంతో ఆ స్త్రీ బొమ్మన్నకి ఒక పావలా చిరునవ్వు తిరిగిచ్చింది. అదే సమయంలో ''చూసావా! ఒక్క మాటతో నేను యాభై రూపాయలు కలిసొచ్చేట్టు చేశాను'' అంటున్న విధంగా గర్వంగా ఆ వాహనస్వామి ఆమెని చూసి పెదవులు వక్రంగా చేస్తున్నప్పుడు నవ్వులాటలన్నీ కార్లో ఎక్కిన తరువాత చూసుకోవచ్చని అనుకుని ఆమె నోటిలో వున్న ఎర్రటి ద్రవ పదార్థాన్ని మూడున్నరసార్లు రోడ్డు ముఖమ్మీద సిలోన్‌లాంటి రెండు మూడు మ్యాపులు చిత్రించింది.

తనకు ఇంగ్లీషు చదవడం వచ్చని నిరూపించడానికి ఆ స్త్రీనాధుడు బొమ్మన్నని-

''ఆ బొమ్మమీద ఎమ్‌సిహెచ్ అని రాసుంది. అంటే ఏమిటి?'' అని అడిగాడు.

''అది మరేం కాదండీ. 'మేడ్ ఇన్ చిక్కడపల్లి' అంతే'' అని అనుకోకుండా వచ్చిన సవాలుకు బొమ్మన్న ఒక్క క్షణంలో జవాబిచ్చాడు.

''చిక్కడపల్లి అనే పదానికి 'హెచ్' బదులు 'పి' అని కదా రావాలి'' అని ఇంకో సవాలు వచ్చేసరికి,

''సార్. నా పేరు బొమ్మన్న. చాలాకాలం క్రితమే బతుకుతెరువు కోసం మేము ఈ నగరానికి వచ్చాము. ఇంట్లో మేము కన్నడంలోనే మాట్లాడుకుంటాం. కర్నాటకలో పల్లి అనడానికి హళ్ళి అంటాము. అందుకే చిక్కడపల్లిని చిక్కడహళ్ళి అంటాం'' అని ఒక ఆశు కవి పటిమతో బొమ్మన్న విడమరచి చెప్పాడు.

ఆ తరువాత ఎప్పుడూ కూడా అతను రాణిగంజ్‌లో బొమ్మలమ్మే ప్రయత్నం చేయలేదు. తను చేసిన ఒక తప్పు ద్వారా పిల్లలకి కావాల్సిన కొన్ని ఒప్పులు అతను చెయ్యగలిగాడు కానీ తప్పు తప్పే కదా అనే పశ్చాత్తాపపూర్వకమైన నిర్ణయానికి వచ్చిన బొమ్మన్న అటువంటి తప్పు మరెన్నడూ చెయ్యలేదు. ★